క్లుప్తంగా

కోటిరెడ్డికి ఎమ్మెల్యే తాటిపర్తి నివాళి



కోటిరెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టు పంచాయతీ శివాపురం వైఎస్సార్ సీపీ నాయకుడు బల్లారపు కోటిరెడ్డి అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. కోటిరెడ్డి భౌతిక కాయానికి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయనతో పాటు పార్టీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ముండ్లమూరు (కురిచేడు): ముండ్లమూరు మోడల్ పాఠశాలలో 6, 7, 8, 9, ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు ఒక ప్రకటనలో కోరారు. సీట్లను భర్తీ చేసేందుకు ఆన్‌లైన్‌లో గురువారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న వారికి ముండ్లమూరు మోడల్ పాఠశాలలో ఈ నెల 24న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఎంపికైన విద్యార్థుల జాబితాను 25వ తేదీన నోటీసు బోర్డులో ప్రదర్శించి 26న ధృవపత్రాలు పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న స్వామీజీలు

త్రిపురాంతకం: మండలంలోని మేడిపిలో వినాయక అయ్యప్ప సుబ్రహ్మణేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్ఛరణలతో గురువారం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తజనులు పాల్గొని పూజలు చేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణ ఆధ్వర్యంలో నిర్మించిన గణపతి అయ్యప్ప సుబ్రహ్మణేశ్వరస్వామి ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ట కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. మూడు రోజులుగా ప్రత్యేక పూజలు వేద పండితుడు రామకృష్ణచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. శైవ పీఠాధిపతి శివస్వామి, హిమాలయ గురువులు కళ్యాణం భారతిస్వామి, భవాని శంకరానందస్వామి, విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు సుమతీదేవి పాల్గొని ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం విగ్రహ ప్రతిష్టలు జరిగాయి. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



ధ్వజస్తంభ ప్రతిష్ట

సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్లలో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు భక్తిశ్రద్ధలతో గురువారం పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టువస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక హారతులు ఇచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దాతల సాయంతో ఆలయ ప్రాంగణంలో స్వామిని దర్శించుకున్న భక్తులు, శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.



భక్తులకు అన్నదానం

బీసీ రుణాలకు మోక్షం ఎప్పుడో?

పెద్దారవీడు:



పెద్దారవీడు మండల పరిషత్ కార్యాలయం

ప్రభుత్వం మంజూరు చేసిన రాయితీ రుణాలతో చిన్న వ్యాపారాలు పెట్టుకుని జీవనం సాగించవచ్చని బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు ముగిసి దాదాపు రెండు నెలలు దాటింది. ఇప్పటికీ రుణాలు మంజూరు కాకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. వెనుకబడిన తరగతుల్లో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించి బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు అందని ద్రాక్షలా మారాయి. కేవలం కూటమి ప్రభుత్వం కార్యకర్తలకు వరంగా మార్చుకుంటున్నారు తప్ప ఎక్కడా పారదర్శకత పాటించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటర్వ్యూలు, దరఖాస్తుల ప్రక్రియ అంతా తూతూ మంత్రంగానే ఉందని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల వారీగా ఈబీసీలకు 11 యూనిట్లకు రూ.20 లక్షలు, బీసీలో కుమ్మరి, మేదర, శాలివాహన వారికి మండల పరిధిలో రెండు యూనిట్లకు రూ.6 లక్షలు, కాపులకు మండల పరిధిలో 4 యూనిట్లకు రూ.13 లక్షలు, గ్రామాల వారీగా బీసీలకు 21 యూనిట్లకు రూ.40 లక్షలు మంజూరు చేశారు. వివిధ కార్పొరేషన్ల రుణాల కోసం మండల పరిధిలో మొత్తం 378 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వారికి మార్చి నెల 20, 21, 22 తేదీల్లో ఇంటర్వ్యూలు చేశారు.

అంతా రాజకీయ జోక్యమే

దరఖాస్తుల ప్రక్రియ మొదలైన నాటి నుంచి రుణాల పంపిణీపై రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో అర్హత ఉన్న సామాన్యులు ఆశలు వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో బీసీ రుణాల మంజూరుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ రుణాలు కూడా అందరికీ అందుబాటులో లేని పరిస్థితులు ఉన్నాయి. యూనిట్లు తక్కువగా ఉండటంతో దరఖాస్తులు ఎక్కువగా ఉండటంతో లబ్ధిదారుల ఎంపికలో గందరగోళం నెలకొంది. మండల వ్యాప్తంగా ఇంటర్వ్యూలు పూర్తయ్యాయి. అయితే ఇంటర్వ్యూలు పూర్తి చేసుకున్న వారికి అప్‌డేట్ మాత్రం ఇవ్వడం లేదు. ఎంపీడీఓ ఎంపిక చేసిన దరఖాస్తులు వివిధ బ్యాంకులకు పంపించామని దరఖాస్తుదారులకు చెబుతున్నారు. లబ్ధిదారుల ఎంపికలో బ్యాంకులు కీలక భూమిక పోషించాల్సి ఉంది. లబ్ధిదారులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇవ్వగా మిగిలిన 50 శాతం రుణం బ్యాంకులు అందజేయాలి. బ్యాంకు అనుమతి లేకుండా కూటమి నాయకుల లబ్ధిదారుల పేర్లను సిఫారసు చేస్తున్నారు. వీరిలో ఎక్కువ మందికి రుణం పొందేందుకు కావాల్సిన సిబిల్ స్కోర్ అనుకూలంగా లేనందున బ్యాంకర్లు రుణం ఇచ్చేందుకు సుముఖత చూపడం లేదు. బ్యాంకుల వద్దకు వెళ్లి అధికారులను అడిగితే ప్రభుత్వం సబ్సిడీ మంజూరు చేయనప్పుడు రుణాలు ఎలా ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి సబ్సిడీ రుణాలు త్వరగా మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అడవులు అంతరిస్తే పర్యావరణానికి ప్రమాదం



దర్శి: మొక్కలు నాటుతున్న సంధ్యారాణి, ఇతర అధికారులు



దొనకొండ: కేజీబీవీలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ

పెద్దదోర్నాల: అడవులు అంతరిస్తే పర్యావరణానికి తీవ్ర ప్రమాదమని పారెస్టు రేంజి అధికారి జీవన్‌కుమార్ హెచ్చరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గణపతి చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన పర్యావరణ పార్కులో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుని మనుగడ, పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని పిలుపు ఇచ్చారు. అంతరించిపోతున్న పులుల సంతతిని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం నల్లమల అడవులను రాజీవ్ పులుల అభయారణ్యంగా గుర్తించిందన్నారు. అడవులు వాటిలో జీవించే ఎన్నో జీవరాసుల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలు పెంచటం సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని, పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు మొక్కల పెంపకమే శరణ్యమన్నారు. డీఆర్వో నాయబ్ రసూల్, చెన్నయ్య, గంగాధర్, ఇస్సాక్ బాబు పాల్గొన్నారు.

పెద్దారవీడు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీఓ జాన్‌సుందరం అన్నారు. గురువారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం, దేవరాజుగట్టు సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎంఈఓలు పి.శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెట్లను నాటాలని, ప్రజలకు పర్యావరణపై అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి సంధ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మురళి, సీఆర్పీలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

దొనకొండ: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ ఎం.శ్రీదేవి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమాన్ని గురువారం స్థానిక బేతేలుపురం అంగన్‌వాడీ కేంద్రం, కేజీబీవీ పాఠశాలలో చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. మొక్కలు నాటి పచ్చదనం పొందాలని, దానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. ముందుగా ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలంటూ అధికారులు ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి అనుష్కోరి, ద్వితీయ బహుమతి సానియా, తృతీయ బహుమతి జాహ్నవి సాధించారు. వారికి ఎంపీడీఓ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో మొక్కలు నాటారు. సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి, ఎంఈఓ ఎస్.సాంబశివరావు, ఐటీసీ జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.వెంకట్రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి, పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి, రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న రేంజి అధికారి జీవన్‌కుమార్



పెద్దారవీడు: మొక్కలు నాటుతున్న ఎంఈఓలు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం

దర్శి (కురిచేడు): ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురువారం నిర్వహించారు. వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ పి.సంధ్యారాణి, వ్యవసాయాధికారి బాలకృష్ణ నాయక్, ఏరువాక కేంద్రం వ్యవసాయాధికారి ఉషారాణి, కేవీకే దర్శి ఫారం మేనేజర్ కె.సంధ్యారాణి పాల్గొని ప్లాస్టిక్ వినియోగం నిరోధించాలని సూచించారు. వ్యవసాయ పరిధోధనా స్థానంలో మొక్కలు నాటారు.

వేసవి శిక్షణ తరగతులతో మేలు



పెద్దారవీడు: విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు



కురిచేడు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సుమతి

పెద్దారవీడు: వేసవి శిక్షణ తరగతులతో విద్యార్థులకు మేలు జరుగుతుందని ఎంఈఓ పి.శ్రీనివాసులు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ గ్రంథాలయంలోని విలువైన పుస్తకాలు చదివితే విద్యార్థులకు ప్రముఖుల జీవిత చరిత్ర స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. క్విజ్ పోటీలతో విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెంపొందుతుందని, చిన్ననాటి నుంచే దేశభక్తి, నైతిక విలువలు పెంపొందించేలా ఉంటుందన్నారు. పుస్తకాలు మంచి నేస్తాలని, పుస్తక పఠనంతో మనోవికాసం కలుగుతుందని, చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలని, చిన్నారులు విజ్ఞానంతో కూడిన ఆటలు ఆడాలన్నారు. అనంతరం ఆటలు, పాటలు, డ్యాన్స్, చెస్, క్యారమ్స్, కోలాటం తదితర ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. 30 మంది బాలబాలికలు పాల్గొన్నారు.

కురిచేడు: స్థానిక శాఖా గ్రంథాలయం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు సమావేశం ఏర్పాటు చేసి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు విజ్ఞాన శిబిరంలో కొత్తపుస్తకాలు చదవటం, కథలు చెప్పటం, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్ నేర్చుకున్నారని గ్రంథపాలకురాలు సుమతి తెలిపారు. డ్రాయింగ్, పాటలు పాడించటం, క్విజ్ పోటీలు నిర్వహించటం, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాన్ని ఎలా ఉపయోగించుకోవాలి, గ్రంథాలయంలో ఎలాంటి పుస్తకాలు ఉంటాయి అనే విషయాలు తెలుసుకున్నారని తెలిపారు. విద్యార్థులు సెలవు రోజుల్లో గ్రంథాలయానికి సాయంత్రం పూట వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆమె కోరారు. పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీ, షేక్ షరీఫ్, డీఏ కృష్ణ, మహిళా పోలీస్ ప్రమీల పాల్గొన్నారు.

మోడల్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ముండ్లమూరు (దర్శి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభ అవార్డుల్లో ముండ్లమూరు మోడల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పదో తరగతి ఫలితాల్లో బి.కీర్తన 583, పి.అశ్విని 583, కె.బాలకృష్ణ 580, జి. గాయత్రి 580, కె.ధనుష్ 567, పి.విజయనాయక్ 554 మార్కులు సాధించి సత్తా చాటారు. వీరికి ప్రభుత్వం ప్రతిభ అవార్డులు ప్రకటించింది. ఉపాధ్యాయుల కృషిని స్థానికులు అభినందించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు అభినందించారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



వంటలు పరిశీలిస్తున్న ఎంఈఓ సుధాకర్‌రావు

తాళ్లూరు: విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు రుచికరమైన భోజనం అందించాలని ఎంఈఓ-2 ఎల్.సుధారర్‌రావు సూచించారు. మండలంలోని తూర్పు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సమగ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేసిన కొత్త మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. అనంతరం వంట మాస్టర్లకు వంట పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు అందించారు. హెచ్ఎం వైఎస్ ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

కల్తీపాలు తయారు చేస్తే చర్యలు



పాల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ మల్లికార్జునరావు

తాళ్లూరు: కల్తీపాలు తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు హెచ్చరించారు. మండలంలో ఉన్న పలు పాల సేకరణ కేంద్రాలను గురువారం ఆయన తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాల కేంద్రాల యాజమాన్యాలతో ఆయన మాట్లాడుతూ పాడి రైతుల నుంచి శ్రేష్ఠమైన పాలు సేకరించాలని, ఉపాధి కల్పించడంలో దోహదపడాలన్నారు. వెన్న శాతం పెరుగుదలకు సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఎవరైనా కల్తీ పాలు పాల్పడితే పోలీసులకు సమాచారం అందిచాలన్నారు.

దర్శి (కురిచేడు): దర్శిలోని పొదిలి రోడ్డు, అద్దంకి రోడ్డులోని పాల సేకరణ కేంద్రాలు, పాల శీతలీకరణ కేంద్రాలను ఏఎస్సై రాంబాబు, సిబ్బంది గురువారం విస్తృతంగా తనిఖీ చేశారు. కల్తీపాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే ఫిర్యాదు చేయాలని పోలీసులు కోరారు. కల్తీపాలు విక్రయించినా, సేకరించినా కఠిన చర్యలు తప్పవని ఏఎస్సై హెచ్చరించారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: మండలంలోని బోయలపల్లి సమీపం హైవేపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. కొలుకుల గ్రామానికి చెందిన ఒంటేరు గోవిందు, మల్లాది ఎల్లయ్య పెద్దారవీడు మండలంలోని కుంట వద్ద జరిగే జీవాల సంతకు వెళ్లి తిరిగి మోటారు బైక్‌పై వస్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన మోటారు బైక్ ఢీకొంది. ఈ సంఘటనలో వారిద్దరితో పాటు మరొకరు కొనంగి రాజయ్యకు గాయాలయ్యాయి. వెంటనే వీరిని స్థానిక ఒక ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఈ ప్రమాదంలో గోవిందు కాలు విరిగిందని, శస్త్ర చికిత్స చేయాల్సి ఉందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ హుటాహుటిన వైద్యశాలకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని ఆయన వైద్యులను కోరారు.

కమ్యూనిస్ట్ పార్టీతోనే పేదలకు న్యాయం



సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య

యర్రగొండపాలెం: భారత కమ్యూనిస్టు పార్టీ పాలనతోనే పేదలకు న్యాయం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. గురువారం స్థానిక షాదీఖానాలో ఆ పార్టీ నియోజక వర్గ 4వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ చేపట్టే కార్యక్రమాలు జనంలోకి వెళ్తాయని, తద్వారా పాలకులకు బుద్ధి చెప్పటానికి అవకాశం ఉంటుందని, 2029 నాటికి దోపిడీ పాలక వర్గాలను బద్దలుకొట్టి రాజకీయ ప్రత్యమ్నాయాన్ని రాష్ట్రంలో నిర్మాణం చేపడతామని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి, పంటకు గిట్టుబాటు ధర, పంట పొలాలకు సాగునీరు, కూలీ రేట్లు పెరగాలి, మహిళలకు రక్షణ కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన ప్రజా నాయకులు వారి వ్యాపారాలు కాపాడుకోవటానికి తప్ప ప్రజల సమస్యలపై స్పందించేవారు లేరని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు హామీలు ఇచ్చేటప్పుడు బడ్జెట్ ఎంత ఉందన్న విషయం తెలియదా..అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు దర్శిలో పార్టీ జిల్లా మహాసభ, ఆగస్టులో ఒంగోలులో రాష్ట్ర మహాసభ జరుగుతుందని, ఆయా సభలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తోందని, రైతులను ఆదుకోవడంలో విఫలమైందని విమర్శించారు. ముందుగా పార్టీ జెండాను ఆ పార్టీ సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య ఆవిష్కరించారు. నాయకులు దేవండ్ల శ్రీనివాస్, జి.గురునాథం, కేవీ కృష్ణగౌడ్, ఎం.సాంబశివరావు, డి.మల్లికార్జున, బి.రామయ్య, ఎస్.తిరుపతయ్య పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు రైతులు సన్నద్ధం కావాలి



భూసార పరీక్ష ఫలితాల సర్టిఫికెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

దర్శి (కురిచేడు): రాబోయే ఖరీఫ్‌కు రైతులు ఎలా సన్నద్ధం కావాలో అవగాహన కల్పించే కార్యక్రమం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌ను గురువారం దర్శి మండలం తూర్పు వీరాయపాలెంలో కేవీకే నోడల్ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రమణారావుతో కలిసి ఆయన మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్‌కు రైతులు ఏ విధంగా వ్యవసాయంలో ముందుకు వెళ్లాలో వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభ్యున్నతికి చేయూతగా అందించే వివిధ పథకాల గురించి వివరించారు. భూసార పరీక్షలను ఖరీఫ్ సాగుకు ముందే చేయించుకొని ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలని సూచించారు. సేద్య విభాగం శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యే రైతులు ముందుగా తమ పొలాలను లోదుక్కులు చేపట్టాలని, తద్వారా భూమి నుంచి ఆశించే వేరుకుళ్లు తెగుళ్ల నుంచి పంటలు రక్షించుకోవచ్చని, కలుపును సమర్థంగా అరికట్టవచ్చని తెలిపారు. వరిలో వచ్చే ఉల్లికోడు, కందిలో వచ్చు కాయ ఈగ, మారుక మచ్చల పురుగు నివారణకు ఉపకరిస్తుందన్నారు. ఈ-పంట నమోదు మరియు, ప్రభుత్వం రైతులకు అందించే వివిధ పథకాల గురించి వ్యవసాయాధికారి వి.బాలకృష్ణ నాయక్ తెలిపారు. ఖాళీగా ఉన్న భూముల్లో ఫారెస్టు జాతికి లేదా ఉద్యానవన పంటలను సాగు చేస్తే భూతాపం తగ్గి వర్షాలు సకాలంలో కురిసేందుకు దోహదపడతాయని తెలిపారు. భూమిలో సేంద్రియ కర్బనం పెరిగేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. రైతులకు 50 శాతం రాయితీతో పచ్చరొట్ట ఎరువులకు సంబంధించిన విత్తనాలు అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఏయే పంటలు అనుకూలంగా ఉంటాయి, ఏయే పంటలను సాగు చేసుకోవాలి, వాటిలో యాజమాన్య పద్ధతులు ఎలా చేపట్టాలో తెలిపారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి



రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న తహసీల్దార్

పుల్లలచెరువు: రేషన్ షాపుల డీలర్లు లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం మండలంలోని పలు రేషన్ షాపులను ఆయన తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు రేషన్ పంపిణీ జరగాలన్నారు. లబ్ధిదారులకు తప్పని సరిగా రేషన్ అందాలని, ఎటువంటి అక్రమాలు చోటుచేసుకున్నా డీలర్ షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి వీఆర్వో తన పరిధిలోని రేషన్ షాపులను తనిఖీ చేస్తూ అధికారుల ఆదేశాలను పాటించాలన్నారు. ప్రతి డీలర్ ప్రభుత్వ నిబంధనల పాటిస్తూ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని తహసీల్దార్ సూచించారు.

వ్యవసాయంలో విత్తన ప్రాముఖ్యం అధికం



రైతులకు విత్తనాల గురించి వివరిస్తున్న సంధ్యారాణి

దర్శి (కురిచేడు): వ్యవసాయ రంగంలో విత్తన ప్రాముఖ్యం చాలా ఉందని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సంధ్యారాణి తెలిపారు. విత్తన దినోత్సవం గురువారం స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానంలో నిర్వహించారు. సంధ్యారాణి మాట్లాడుతూ సరైన విత్తనాన్ని ఎంచుకుంటే 20 శాతం అధిక దిగుబడులు పొందొచ్చన్నారు. ఏరువాక కేంద్రం బాపట్ల శాస్త్రవేత్త డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ మంచి విత్తనం దాచుకుని రైతులే తమ విత్తనాన్ని తదుపరి సీజన్‌లో వాడాలని సూచించారు. ఆరోగ్యకర విత్తనం..అధిక దిగుబడికి నాంది అని తెలిపారు. రైతు విత్తన ఎంపికలో జాగ్రత్త వహించాలని కేవీకే ఫారం మేనేజరు కె.సంధ్యారాణి తెలిపారు. చీడపీడల నివారణకు విత్తనశుద్ధి చేసుకోవాలని వ్యవసాయాధికారి బాలకృష్ణ నాయక్ తెలిపారు. డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బిల్లులు తప్పక తీసుకోవాలని సూచించారు. ఎఆర్‌జి-52 కంది రకం, మినుములు టీబీజీ 104, డబ్ల్యూబీజీ-904 విత్తనాలు వ్యవసాయ పరిశోధన స్థానం మరియు కేవీకేలో అందుబాటులో ఉన్నట్లు వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.